అంబులెన్స్ చోరీ.. పోలీసుల ఛేజింగ్

హయత్‌నగర్‌లో కొట్టేసి విజయవాడ వైపు పరారీ

చిట్యాలలో ఆపేందుకు యత్నించిన ఏఎస్ఐని ఢీకొట్టిన వైనం

టేకుమట్ల బ్రిడ్జి వద్ద లారీలు అడ్డుపెట్టి పట్టుకున్న పోలీసులు

కేతేపల్లి/హయత్‌నగర్, డిసెంబర్ 7 : 108 అంబులెన్స్‌ను చోరీ చేసి ఎన్‌హెచ్-65పై పారిపోతున్న వ్యక్తిని పోలీసులు సినీ ఫక్కీలో ఛేజింగ్ చేసి పట్టుకున్నారు. శనివారం హయత్‌నగర్ నుంచి సూర్యాపేట జిల్లా టేకుమట్ల వరకు జరిగిన ఈ ఛేజింగ్ సినిమాను తలపించింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా బయ్యారం గ్రామానికి చెందిన రావుల వెంకటరామనర్సయ్య హయత్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. చిన్ని చిన్న దొంగతనాలకు పాల్పడుతూ పలుమార్లు పోలీసులకు చిక్కాడు. శనివారం హయత్‌నగర్ సమీపంలోని సన్‌రైజ్ దవాఖాన వద్ద ఆగి ఉన్న 108 అంబులెన్స్‌ను చోరీ చేసి జాతీయ రహదారి-65పై సైరన్ మోగిస్తూ దూసుకెళ్లాడు. ఈ విషయాన్ని గమనించిన అంబులెన్స్ సిబ్బంది హయత్‌నగర్ పోలీసులకు సమాచారం అందించారు. వారు హైవేపై ఉన్న పోలీస్‌స్టేషన్లకు సమాచారం ఇవ్వడంతో అప్రమత్తమైన పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. అప్పటికే నిందితుడు అంబులెన్స్‌తో చౌటుప్పల్ దాటి చిట్యాలకు చేరుకున్నాడు. చిట్యాల వద్ద ఏఎస్ఐ జాన్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది వాహనాన్ని ఆపేందుకు ప్రయత్నించినా ఆపకపోవడంతో పోలీస్ వాహనంలో అంబులెన్స్‌ను వెంబడించారు. కట్టంగూర్ మండలం పామనుగుండ్లలో ఆపేందుకు ప్రయత్నించగా నిందితుడు ఏఎస్ఐని ఢీకొట్టి వెళ్లిపోయాడు. దాంతో ఏఎస్ఐ కాలు, ముఖానికి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. మరింత అప్రమత్తమైన పోలీసులు కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద విజయవాడ వైపు వెళ్లే దారిలో బారికేడ్లను ఏర్పాటుచేశారు. ఐనప్పటికీ నిందితుడు లెక్కచేయకుండా అంబులెన్స్‌తో బారికేడ్లను, టోల్‌ప్లాజా గేట్‌ను ఢీకొట్టి సూర్యాపేట వైపు వెళ్లాడు. కేతేపల్లి ఎస్ఐ శివతేజ సూర్యాపేట పోలీసులకు సమాచారం ఇవ్వడంతోపాటు సిబ్బందితో కలిసి టేకుమట్ల బ్రిడ్జి వద్ద లారీలను అడ్డుపెట్టి విజయవాడ వైపు వెళ్లే దారిని మూసివేశారు. దాంతో దారిలేకపోవడంతో అంబులెన్స్‌ను రోడ్డు కిందికి దింపాడు. అప్పటికే అక్కడ కాపుకాసిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిందితుడిని, అంబులెన్స్‌ను హయత్‌నగర్ పోలీసులకు అప్పగించారు.

నిందితుడు వెంకటరామనర్సయ్య

సూర్యాపేట జిల్లా టేకుమట్ల వద్ద రోడ్డు కిందికి దూసుకెళ్లిన 108 అంబులెన్స్

బీఆర్ఎస్ పోరాటంతోనే నవోదయ స్కూళ్లు

- పలుమార్లు కేంద్రానికి వినతులు
- లోక్‌సభాపక్ష నేత నామా

హైదరాబాద్, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పోరాటంతోనే కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఏడు నవోదయ విద్యాలయాలను మంజూరుచేసిందని బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత నామా నాగేశ్వర్‌రావు స్పష్టంచేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రానికి 21 నవోదయ విద్యాలయాలు మంజూరుచేయాలని కోరితే ఏడు మాత్రమే ఇచ్చినట్టు పేర్కొన్నారు. కొత్తగా ఏర్పడిన ప్రతి జిల్లాకు నవోదయ విద్యాలయం కేటాయించాలని కేంద్ర మంత్రులకు పలుమార్లు లేఖలు రాసినట్టు గుర్తుచేశారు. ఈ విషయంపై పార్లమెంటు సమావేశాల్లోనూ కేంద్రానికి ప్రశ్నలు సంధించినట్టు చెప్పారు. అప్పటి సీఎం కేసీఆర్ సైతం ప్రధానికి లేఖ రాసినట్టు తెలిపారు. తాను ఎంపీగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచే నవోదయ విద్యాలయాల కోసం పోరాడినట్టు నామా వెల్లడించారు. పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం ముందు నిరసన వ్యక్తంచేసినట్టు తెలిపారు. నూతన నవోదయ విద్యాలయాలను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని కేంద్రాన్ని కోరారు.

జేఎన్వీల కేటాయింపును స్వాగతిస్తున్నాం: వినోద్‌కుమార్

హైదరాబాద్, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): తెలంగాణకు ఏడు జవహర్ నవోదయ విద్యాలయాల కేటాయింపును స్వాగతిస్తున్నట్టు మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 23 కొత్త జిల్లాల్లో జేఎన్వీలు ఏర్పాటుచేయాలనే డిమాండ్ పదేండ్లుగా పెండింగ్ ఉన్నదని, తాజాగా కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రంలోని బడుగు, బలహీనవర్గాల పిల్లలకు మెరుగైన విద్య అందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మిగతా జిల్లాల్లోనూ విద్యాలయాలు ఏర్పాటుచేయాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్‌ను కోరారు.

సీఎం కప్ టోర్నీలో విద్యార్థి మృతి

- వాలీబాల్ ఆడుతూ కుప్పకూలిన సాయిప్రణీత్
- వెంటనే దవాఖానకు తరలించేలోపే కన్నుమూత
- వనపర్తిలో విద్యార్థి సంఘాల రాస్తారోకో

సాయిప్రణీత్ (ఫైల్)

పెద్దమందడి/వనపర్తి టౌన్, డిసెంబర్ 7 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీల్లో పాల్గొన్న ఓ విద్యార్థి కుప్పకూలి ప్రాణాలు వదిలాడు. శనివారం వనపర్తి జిల్లాలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా.. పెద్దమందడి మండలం బలిజపల్లి, జంగమాయపల్లి జంట గ్రామాల ఉన్నత పాఠశాలలో పాఠశాల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహించారు. అదే పాఠశాలలో చదువుతున్న ముందరితండా (పామిరెడ్డిపల్లితండా)కు చెందిన టెన్త్ విద్యార్థి సాయిప్రణీత్ (16) శనివారం వాలీబాల్ ఆడుతూ కళ్లు తిరుగుతున్నాయని చెప్పి కిందపడిపోయాడు. వెంటనే ఉపాధ్యాయులు వనపర్తి దవాఖానకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. అయితే ఉదయం ఒకసారి కండ్లు తిరుగుతున్నాయని విద్యార్థి చెప్పడంతో అతడి తల్లి లీలమ్మ దవాఖానలో చూపించి పాఠశాలకు పంపించింది. ఈ క్రమంలో ఆట ఆడుతుండగా.. ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అతడి తండ్రి రవి దుబాయ్‌లో ఉంటున్నాడు. అతడికి అక్క, తమ్ముడు ఉన్నారు. సాయిప్రణీత్ కుప్పకూలిన ఘటనను చూసిన మరో విద్యార్థిని ప్రియ అప స్మారక స్థితికి చేరగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి

సాయిప్రణీత్ మృతిని నిరసిస్తూ వనపర్తి జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌక్‌లో విద్యార్థి సంఘాల నేతలు రాస్తారోకో చేపట్టారు. బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ, గిరిజన విద్యార్థి సంఘం, పీడీఎస్‌యూ, ఎంఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కలెక్టర్ రావాలని, విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలని నినదించారు. మృతుడి కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాలుగు గంటలపాటు ధర్నా చేపట్టినా అధికారులు స్పందించకపోవడంపై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఓ వైపు ఆందోళన కొనసాగుతుండగా.. ఎమ్మెల్యే మేఘారెడ్డి, ఆర్డీవో జిల్లా దవాఖానకు చేరుకొని సాయి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

50వేల ఎకరాల ఫ్యూచర్‌సిటీకి భూములు ఇవ్వాల్సిందే

- ఏదైనా కట్టాలంటే ఎవరో ఒకరు కోల్పోవాలి
- మూసీకి అడ్డొస్తే ముంచేస్తం
- సంక్రాంతి తర్వాత రైతుభరోసా
- నల్లగొండ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- రాజగోపాల్‌రెడ్డి డుమ్మా.. జనాలు లేక సభ అట్టర్‌ఫ్లాప్

సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతుండగానే వెళ్లిపోతున్న జనం

నల్లగొండ ప్రతినిధి, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): ఫోర్త్ సిటీనీ ఫ్యూచర్ సిటీగా 50వేల ఎకరాల్లో నిర్మించే బాధ్యత తనదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రీజినల్ రింగ్ రోడ్డును నిర్మిస్తామని తెలిపారు. ఏదైనా కట్టాలంటే ఎవరో ఒకరు ఏదో ఒకటి కోల్పోవాల్సిందేనని వ్యాఖ్యానించారు. శనివారం నల్లగొండ జిల్లా బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు పైలాన్‌ను రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టులో రెండో యూనిట్ ద్వారా విద్యుదుత్పత్తి, నల్లగొండ మెడికల్ కాలేజీని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజీవ్ మైదాన్‌లో కాంగ్రెస్ ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా నిర్వహించిన సభలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దామోదర రాజనరసింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలసి పాల్గొన్నారు. ఈ సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ "మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం. మూసీ ప్రక్షాళన చేయకపోతే నల్లగొండ ప్రజలు బతకలేరు. మూసీలో గోదావరి జలాలను ప్రవహింపజేసి, ప్రజలకు కాలుష్యం నుంచి విముక్తి కల్పిస్తాం" అన్నారు. సంక్రాంతి తర్వాత రైతుభరోసా డబ్బులు జమ చేస్తామని చెప్పారు.

బీఆర్ఎస్ ప్రాజెక్టునే మరోసారి

శనివారం నల్లగొండ పర్యటనలో రేవంత్‌రెడ్డి ప్రారంభించిన అభివృద్ధి పనులు ఏవీ కూడా కాంగ్రెస్ ఏడాది పాలనలో చేపట్టినవి కావు. బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు పూర్తయిందంటూ పైలాన్‌ను ఆవిష్కరించారు. రెండు మోటార్ల ద్వారా ఎత్తిపోస్తున్న నీటికి హారతి ఇచ్చారు. కానీ ఈ ప్రాజెక్టుకు ఉమ్మడి రాష్ట్రంలో 2007లో అప్పటి సీఎం రాజశేఖర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కానీ మధ్యలోనే ఆగిపోయింది. తెలంగాణ రాష్ట్రంలో తొలి సీఎం కేసీఆర్ సర్కారు రూ.674.67 కోట్లతో అంచనాలు రూపొందించి, రూ.469 కోట్లు ఖర్చుపెట్టింది. సర్జ్‌పూల్, పంప్‌హౌజ్, అప్రోచ్ కెనాల్, సొరంగమార్గం లైనింగ్, విద్యుదీకరణ పనులు పూర్తిచేసింది. నిరుడు మే 6న ట్రయల్ రన్, మోటార్ల పరీక్ష నిర్వహించారు. ఇక కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టు కోసం నిధులు ఇవ్వలేదు. పనుల్లోనూ పురోగతి లేదు. కొత్తగా ఒక్క ఎకరాకు సాగునీరు ఇవ్వలేదు. కానీ మరోసారి ట్రయల్‌రన్ నిర్వహించమేంటని జనం విస్మయం వ్యక్తంచేస్తున్నారు.

కేసీఆర్ ఘనతపై మాట్లాడని రేవంత్

కేసీఆర్ కలల ప్రాజెక్టుగా ప్రసిద్ధిగాంచిన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులు 85 శాతం వరకు బీఆర్ఎస్ హయాంలోనే పూర్తయ్యాయి. మిగతా పనులు కూడా ప్రణాళిక ప్రకారం జరిగాయి. పవర్ ప్లాంట్‌లోని రెండో యూనిట్ ద్వారా 800 మెగావాట్ల విద్యుదుత్పత్తిని రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. నల్లగొండ మెడికల్ కాలేజీని కూడా కేసీఆర్ హయాంలోనే నిర్మించారు. నల్లగొండ పర్యటనలో రేవంత్‌రెడ్డి ఈ రెండింటి గురించి ఎక్కడా మాట్లాడలేదు. కేసీఆర్‌కు క్రెడిట్ దక్కుతుందన్న ధోరణితో రేవంత్ వాటి గురించి మాట్లాడలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

రాజగోపాల్‌రెడ్డి డుమ్మా

నల్లగొండ సభకు మునుగోడు ఎమ్మెల్యే రాజ్‌గోపాల్‌రెడ్డి డుమ్మా కొట్టారు. మంత్రిపదవి ఇవ్వలేదనే అసంతృప్తితోనే కాంగ్రెస్, ప్రభుత్వ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారని జిల్లాలో చర్చ జరుగుతున్నది. స్వగ్రామం బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు వరకు వెళ్లిన రాజ్‌గోపాల్‌రెడ్డి నల్లగొండ కార్యక్రమాల్లో పాల్గొనకుండా హైదరాబాద్ వెళ్లిపోయారు. బ్రాహ్మణవెల్లంలలో రాజ్‌గోపాల్‌రెడ్డిని గమనించిన ఆయన సోదరుడు వెంకటరెడ్డి.. '10 నెలల నుంచి దూరంగా ఉంటున్నవు. ఎక్కడా కనిపిస్తలేవు. ఇటురా గోపాల్' అనడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.

సీఎం రేవంత్ సభ వెలవెల

నల్లగొండలో సీఎం రేవంత్‌రెడ్డి సభ జనం లేక వెలవెలబోయింది. సీఎం సభా ప్రాంగణానికి చేరుకునే సమయానికే జనం తిరుగుముఖం పట్టారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతుండగానే జనం వెళ్లిపోయారు. ఆ తర్వాత క్రమంలో ఉత్తమ్, భట్టి మాట్లాడారు. అప్పటికి సభ మరింత ఖాళీ అయింది. ఇక దామోదర మాట్లాడేందుకు నిరాకరించారు. చివరిగా రేవంత్ ప్రసంగించారు. రేవంత్‌రెడ్డి మాట్లాడుతుండగానే జనం సభా ప్రాంగణం నుంచి వెళ్లిపోయారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

ఎన్‌కౌంటర్‌పై పౌరహక్కుల సంఘం నేత కుమారస్వామి డిమాండ్

కమాన్‌పూర్/పాలకుర్తి, డిసెంబర్ 7: మావోయిస్టులపై జరుగుతున్న బూటకపు ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని పౌర హక్కుల సంఘం నేత కుమారస్వామి డిమాండ్ చేశారు. ఇటీవల ఎన్‌కౌంటర్‌లో అసువులు బాసిన మావోయిస్టు, పాలకుర్తి మండలం రాణాపూర్‌కు చెందిన ఏగోలపు మల్లయ్య అలియాస్ మధు అంత్యక్రియలు శనివారం స్వగ్రామంలో జరుగగా ప్రజాసంఘాల నాయకులతో కలిసి ఆయన హాజరై మాట్లాడారు. రేవంత్ సర్కారు గద్దెనెక్కినంక ఏడాది కాలంలో జరిగిన నాలుగు ఘటనలపై హైకోర్టు జడ్జితో న్యాయవిచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి: రాజకీయ ఖైదీల విముక్తి కమిటీ నేత రవీందర్

సమాజంలో సమానత్వం కోసం ఉద్యమిస్తున్న మావోయిస్టు నేతల బూటకపు ఎన్‌కౌంటర్లపై ప్రజాస్వామ్యవాదులు, ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని రాజకీయ ఖైదీల విముక్తి కమిటీ నేత రవీందర్ పేర్కొన్నారు. జగిత్యాల జైత్ర యాత్ర నేపథ్యంలో మావోయిస్టు ఉద్యమంలోకి అడుగుపెట్టిన మల్లయ్య నమ్మిన సిద్ధాంతం కోసం 32 ఏళ్ల పాటు పోరుబాట సాగించారని గుర్తు చేశారు.

మల్లయ్యది బూటకపు ఎన్‌కౌంటరే: భార్య మీనా

తన భర్తది ముమ్మాటికీ బూటకపు ఎన్‌కౌంటరేనని మల్లయ్య భార్య మీనా ఆరోపించారు. 32 ఏళ్ల పాటు అడవి బాట పట్టి ఉద్యమం చేస్తున్న తన భర్త ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడంటే ఎలా నమ్మాలని ప్రశ్నించారు. చిత్ర హింసలు చేసి, ములుగు జిల్లా ఏటూరునాగారం అడవుల్లోకి తీసుకెళ్లి కాల్చి చంపి, ఎన్‌కౌంటర్‌గా చిత్రీకరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

प्रगत संगणन विकास केन्द्र
सेंटर फॉर डेवलप्मेंट ऑफ अड्वान्स्ड कंप्यूटिंग
इलेक्ट्रॉनिकी और सूचना प्रौद्योगिकी मंत्रालय की वैज्ञानिक संस्था, भारत सरकार
सी डैक CDAC
एलक्ट्रानिक्स् अण्ड् इन्फ़र्मेशन् टेक्नालजी मंत्रित्वशाखा यॊक्क सैंटिफ़िक् सॉसैटी, भारत प्रभुत्वम्

ప్రవేశ ప్రకటన

PG డిప్లొమా కోర్సులు-ఫిబ్రవరి 2025 బ్యాచ్

- PG డిప్లొమా ఇన్ అడ్వాన్స్‌డ్ సెక్యూర్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ (PG-DASSD)
- PG డిప్లొమా ఇన్ ఎంబెడెడ్ సిస్టమ్స్ డిజైన్ (PG-DESD)
- PG డిప్లొమా ఇన్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (PG-DAC)
- PG డిప్లొమా ఇన్ IT ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సిస్టమ్స్ & సెక్యూరిటీ (PG-DITISS)
- PG డిప్లొమా ఇన్ బిగ్ డేటా అనలిటిక్స్ (PG-DBDA)
- PG డిప్లొమా ఇన్ VLSI డిజైన్ (PG-DVLSI)
- PG డిప్లొమా ఇన్ అన్‌మ్యాన్డ్ ఎయిర్‌క్రాఫ్ట్ సిస్టమ్ ప్రోగ్రామింగ్ (PG-DUASP)

C-DAC's R&D నిపుణులు శిక్షణనిస్తారు
అత్యుత్తమ ప్లేస్‌మెంట్ రికార్డులు

➡ C-CAT రిజిస్ట్రేషన్ల కొరకు ఆఖరి తేది: 30 డిసెంబర్ 2024
➡ C-CAT తేది: 11 మరియు 12 జనవరి 2025
➡ కోర్సు ప్రారంభం: 25 ఫిబ్రవరి 2025

మరింత సమాచారానికి QR కోడ్ స్కాన్ చేయండి

రిజిస్ట్రేషన్ కొరకు దర్శించండి: acts.cdac.in (లేదా) www.cdac.in

C-DAC, ప్లాట్ నం. 6&7, హార్డ్‌వేర్ పార్క్ సర్నే నం.1/1, శ్రీశైలం హైవే, పహాడీ షరీఫ్ వయా కేశవగిరి (పోస్ట్), హైదరాబాద్-501510
మరిన్ని వివరాలకు: ఫోన్: +917382053731/32 ఇ-మెయిల్: training-hyd@cdac.in

CBC-06110/12/0006/2425

'సీతారామ' నీటికోసం పాదయాత్ర

ఇల్లెందు నుంచి భద్రాచలం బయల్దేరిన సేవాలాల్ సేన

ఇల్లెందు, డిసెంబర్ 7 : సీతారామ ప్రాజెక్టు ద్వారా రైతుల భూములకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ సేవాలాల్ సేన జిల్లా కమిటీ అధ్యక్షుడు శివనాయక్ ఆధ్వర్యంలో ఇల్లెందు నుంచి భద్రాచలం వరకు శనివారం పాదయాత్ర చేపట్టారు. ఇల్లెందు కొత్త బస్టాండ్ సెంటర్‌లో సేవాలాల్ రైతు సేన రాష్ట్ర కన్వీనర్ కిషన్‌నాయక్.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, కుమ్రంభీం విగ్రహాలకు పూలమాల వేసిన అనంతరం యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌నాయక్, శివనాయక్ మాట్లాడుతూ రైతుల పంట భూములకు నీరందించాలనే డిమాండ్‌తో యాత్ర చేపట్టినట్టు తెలిపారు. ఈ యాత్ర ఇల్లెందు పట్టణం నుంచి టేకులపల్లి, పాల్వంచ క్రాస్ రోడ్డు, పాల్వంచ పట్టణం మీదుగా సోమవారం ఉదయం భద్రాచలం చేరుకుంటుందని తెలిపారు.

మాయలోడు రేవంత్‌రెడ్డి

బీజేపీ సభలో కేంద్ర మంత్రుల విమర్శ

హైదరాబాద్, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డి మాయలోడు అని కేంద్ర మంత్రి జేపీ నడ్డా అన్నారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో శనివారం నిర్వహించిన బీజేపీ బహిరంగ సభలో నడ్డా మాట్లాడారు. పేదలను మభ్యపెట్టి హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. మూడు రాష్ట్రాల్లోనూ హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని విమర్శించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డిని ప్రజలు ముఖ్యమంత్రిగా చూడటంలేదని అన్నారు. అర్బన్ నక్సల్స్ చేతిలో రేవంత్ సర్కార్ బందీగా మారిందని విమర్శించారు. కాంగ్రెస్ సర్కార్‌కు సంక్రాంతి వరకే డెడ్ లైన్ అని... అప్పటిలోగా ఆరు గ్యారెంటీలు అమలు చేయకుంటే గ్రామాల్లో తిరగనీయమని హెచ్చరించారు. రాష్ట్రంలో అహంకార, అవినీతి పాలన కొనసాగుతున్నదని మరో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు.

సాగర్ నుంచి ఏపీకి 12 టీఎంసీలు

విడుదలకు కేఆర్ఎంబీ ఉత్తర్వులు

హైదరాబాద్, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): సాగర్ ఎడమ కాల్వ జోన్ 3లోని ఏపీ ఆయకట్టుకు 12 టీఎంసీల నీటిని విడుదల చేస్తూ కేఆర్ఎంబీ ఉత్తర్వులిచ్చింది. ఆ జోన్‌లోని ఆయకట్టుకు ఇప్పటికే 9.55 టీఎంసీలు వినియోగించుకున్న ఏపీ.. తాజాగా డిసెంబర్ 31 వరకు మరో 15.86 టీఎంసీలు అవసరమని, ఆ మేరకు జలాలు విడుదల చేయాలని ఇటీవల బోర్డుకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు అందుబాటులోని నిల్వలు, ఇప్పటివరకు వినియోగించిన నీటి వివరాలను దృష్టిలో పెట్టుకుని రోజుకు 3,059 క్యూసెక్కుల చొప్పున 12 టీఎంసీలను విడుదల చేయాలని కేఆర్ఎంబీ నిర్ణయించింది.

నిమ్స్‌లో ప్రాణం తీసిన బెడ్‌ల కొరత

- కోలుకోకుండానే డిశ్చార్జ్
- సకాలంలో వైద్యం అందక మృతి: కుటుంబసభ్యులు
- పరిస్థితి చేజారాకే అడ్మిట్ అయ్యారు: డాక్టర్ శ్రీభూషణ్‌రాజు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబరు 7(నమస్తే తెలంగాణ): నిమ్స్‌లో బెడ్‌ల కొరత ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. ఇతరులకు బెడ్ కావాలంటూ చికిత్స మధ్యలోనే డిశ్చార్జ్ చేయడంతో సకాలంలో వైద్యం అందక సదరు రోగి మృతిచెందినట్టు బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన దుబ్బ యాదగిరి కిడ్నీ, కాలేయ సంబంధిత వ్యాధుల చికిత్స కోసం గత నెల 26న నిమ్స్ నెఫ్రాలజీ విభాగంలో ఆరోగ్యశ్రీ కింద అడ్మిట్ అయ్యాడు. పరిస్థితి క్లిష్టంగా ఉండటంతో ఐసీయూలో చేర్చుకున్నారు. 2,3 రోజుల తరువాత ఐసీయూలో బెడ్స్ ఇతరులకు కావాలంటూ జనరల్‌వార్డుకు షిఫ్ట్ చేశారు. అనంతరం అక్కడ వేరే రోగికి బెడ్ కావాలంటూ ఈ నెల 3న డిశ్చార్జ్ చేశారు. మరుసటిరోజు ఓపీకి తీసుకురాగా, పేషెంట్ అడ్మిట్ ఉన్నట్టు చూపిస్తున్నదని, డిశ్చార్జ్ షీట్ ఇంకా ఆన్‌లైన్‌లో అప్‌డేట్ కాలేదని సిబ్బంది చెప్పారు. 5న మళీ నిమ్స్‌కు రాగా, కొన్ని వైద్య పరీక్షలు చేయాలని చెప్పారు. ఆరోగ్యశ్రీ కింద పరీక్షలు చేయించాలంటే సాయంత్రం 6 గంటల వరకు ఆగాలని సూచించారు. త్వరగా కావాలంటే బిల్లు చెల్లించాల్సి ఉంటుందనడంతో రూ.2100 చెల్లించి పరీక్షలు చేయించినట్టు పేర్కొన్నారు. బీపీ తగ్గి ఆరోగ్యం క్లిష్టంగా మారిందని చెప్పారు. వెంటనే ఐసీయూకు తరలించి చికిత్స ప్రారంభించారని, శనివారం యాదగిరి మృతిచెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు.

బెడ్‌ల కొరత అవాస్తవం

నిమ్స్‌లో బెడ్‌ల కొరత పూర్తిగా అవాస్తవం. రోగి పరిస్థితి క్లిష్టంగా ఉంటే డిశ్చార్జి చేసే ప్రసక్తే ఉండదు. యాదగిరి విషయంలో కిడ్నీ, కాలేయం రెండూ పూర్తిగా దెబ్బతిన్నాయి. ట్రాన్స్‌ప్లాంట్ చేయాల్సిన దశకు చేరుకోవడంతో పాటు ఆరోగ్య పరిస్థితి పూర్తిగా చేయిదాటిపోయింది. ఆరోగ్యం క్షీణించడం వల్లే ఆయన మృతిచెందాడు.

-డా.శ్రీభూషన్‌రాజ్, నెఫ్రాలజీ ప్రొఫెసర్

వద్దంటే ఫ్రీ బస్సు బంద్

మిగతా హామీలు రెండేండ్లలో: మంత్రి శ్రీధర్‌బాబు

వరంగల్ జిల్లా శాయంపేటలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

గీసుగొండ, డిసెంబర్ 7 : ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో మిగిలిన హామీలను రెండేండ్లలో అమలుచేస్తామని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. శనివారం వరంగల్ జిల్లా గీసుగొండ మండలం శాయంపేట కాకతీయ మెగా టెక్సటైల్ పార్కును శనివారం ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డితో కలిసి సందర్శించారు. అనంతరం గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ గొర్రెకుంట హరిహర ఎస్టేట్‌లో రూ.50 లక్షలతో నిర్మించిన విశ్వబ్రాహ్మణ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఫ్రీ బస్సు కోసం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీకి రూ.120 కోట్లు చెల్లిస్తున్నారని చెప్పారు. దీంతో అక్కడున్న మహిళలు.. 'ఆటో వాళ్లు సచ్చిపోతున్నారు సారు' అంటూ ప్రసంగానికి అడ్డుతగిలారు. 'మీరు వద్దంటే ఫ్రీ బస్సు పక్కన పెడ్తామని మంత్రి చెప్పారు. 200 యూనిట్ల వరకు ఉచితంగా కరెంటు ఇస్తున్నము, ఆ పైసలు ప్రభుత్వమే చెల్లిస్తున్నది' అని అన్నప్పుడు మహిళలు జోక్యం చేసుకొని 'మా ఒక్కరికే ఇస్తలేరు.. అందరికీ వస్తున్నది' అంటూ మరోసారి చెప్పడంతో 'అమ్మా మీరు అట్లా మాట్లాడితే కుదరదు' అని మంత్రి ఆవేశానికి లోనయ్యారు. స్థానిక నాయకులు మహిళలను సముదాయించడంతో మంత్రి ప్రసంగాన్ని ముగించారు. కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు ఉన్నారు.

ఇండస్ట్రియల్ ఆయిల్ కార్పొరేషన్‌పై హైకోర్టు ఆగ్రహం

కోర్టును మోసగించినందుకు రూ.5 లక్షల జరిమానా

హైదరాబాద్, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): ఇండస్ట్రియల్ ఆయిల్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీపై హైకోర్టు